
# పద్మశ్రీ వనజీవి రామయ్య ఇకలేరు



వనజీవి రామయ్యను ప్రశంసిస్తున్న మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

> మొదటిపేజీ తరువాయి...

ఐదు గంటలకు నిద్రలేచే అలవాటు ఉన్న రామయ్య.. టైమ్‌కి లేవకపోయేసరికి అతని భార్య జానకమ్మ అనుమానంతో దగ్గరికి వెళ్లి చూడగా నిస్సహాయ స్థితిలో ఉన్నాడు. దీంతో పక్కింటివారి సాయంతో హుటాహుటిన ఖమ్మం జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలకు తరలించారు. రామయ్యను పరిశీలించిన వైద్యులు గుండెపోటుతో మృతిచెందినట్టు తెలిపారు. రామయ్య భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులు రెడ్డిపల్లిలోని తన స్వగృహానికి తరలించారు. 'పచ్చటి చెట్టు ప్రాణం విడిచింది' అనే వార్తలు ఒక్కసారిగా సోషల్‌మీడియా, మీడియా ప్రచార సాధనాల ద్వారా విషయం తెలుసుకున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా 50 ఏండ్లుగా మొక్కల పెంపకం చేపట్టి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరుప్రఖ్యాతలు తెచ్చుకున్న రామయ్య మరణవార్తతో ఆయన అభిమానులు, ప్రకృతి ప్రేమికులు తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. రామయ్యను కడసారి చూసేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సామాజిక కార్యకర్తలు, రాజకీయ నాయకులు పెద్దఎత్తున రెడ్డిపల్లికి తరలివచ్చారు. భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. రామయ్య మృతిపై ప్రముఖులు సంతాపం వ్యక్తంచేశారు. ప్రధాని మోదీ, బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, తెలుగు రాష్ట్రాల సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, నారా లోకేశ్, కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎంపీ నామా నాగేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి, సీబీఐ మాజీ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణతోపాటు వివిధ పార్టీల నాయకులు, సామాజికవేత్తలు సోషల్ మీడియా ద్వారా సంతాపం వ్యక్తంచేశారు. రామయ్య భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. రామయ్య అంత్యక్రియలు ఆదివారం రెడ్డిపల్లిలో జరుగనున్నాయి.

**రామయ్య వైద్యం కోసం కేసీఆర్ ఆర్థికసాయం..**

2018లో వనజీవి రామయ్య అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటే కుటుంబ సభ్యులు ఖమ్మం దవాఖానకు తరలించారు. వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ కేర్ దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్.. వనజీవి రామయ్య వైద్యానికి అయ్యే ఖర్చులన్నీ భరిస్తామని చెప్పి మాట నిలబెట్టుకున్నారు. దీంతో ఆయన కుటుంబ సభ్యులు కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

**సుస్థిరత కోసం గళం వినిపించిన వ్యక్తి : మోదీ**

పద్మశ్రీ పురస్కార గ్రహీత వనజీవి రామయ్య మృతిపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఈ మేరకు శనివారం తెలుగులో ట్వీట్ చేశారు. రామయ్య సుస్థిరత కోసం గళం వినిపించిన వ్యక్తిగా గుర్తుండిపోతారని, లక్షలాది మొక్కలు నాటి, వాటి రక్షణకు ఆయన తన జీవితాన్ని అంకితమిచ్చారని కొనియాడారు. ఆయన అవిశ్రాంత కృషి ప్రకృతిపై గాఢమైన ప్రేమను, భవిష్యత్తు తరాలపై బాధ్యతను ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులకు తన ప్ర గాఢ సానుభూతి తెలియజేస్తున్నట్టు చెప్పారు.

**రామయ్య జీవితం స్ఫూర్తిదాయకం : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

ఇంటిపేరును వనజీవిగా మార్చుకుని పర్యావరణ పరిరక్షణకు జీవితాన్ని అంకితం చేసిన పద్మశ్రీ రామయ్య స్వర్గస్తులయ్యారని తెలిసి తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నట్టు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శనివారం ఎక్స్ వేదికగా తెలిపారు. ప ర్యావరణ పరిరక్షణ లక్ష్యాలను చేరుకునే క్రమంలో రామయ్య జీవితం మనందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. రామయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

**రామయ్య మృతి తీరనిలోటు : మాజీ మంత్రి హరీశ్‌రావు**

ప్రకృతి ప్రేమికుడు, హరిత స్వాప్నికుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య మరణం సమాజానికి తీరని లోటని హరీశ్‌రావు పేర్కొన్నారు. వృక్షో రక్షతి రక్షిత: అనే సిద్ధాంతాన్ని త్రికరణ శుద్ధిగా ఆచరించి మొక్కలను కన్నబిడ్డల వలే పెంచి ఇంటిపేరునే వనజీవిగా మార్చుకొని కోట్లాది మొక్కలకు ప్రాణం పోశారని కొనియాడారు. పర్యావరణ హితమే తన ఊపిరిగా భావించిన ఆయన, ఆరోగ్యం సహకరించకున్నా మొక్కలు నాటే ఉద్యమాన్ని ఆపలేదని గుర్తుచేశారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని ప్రార్థించారు.



విత్తనాల సేకరణలో వనజీవి రామయ్య(ఫైల్)



మాజీ ఎంపీ సంతోష్‌కుమార్‌తో వనజీవి రామయ్య దంపతులు(ఫైల్)

**రామయ్య సంకల్పం ఆదర్శం : కవిత**

వృక్షో రక్షతి రక్షిత: అనే నినాద స్ఫూర్తితో హరిత కోటీశ్వరుడు వనజీవి రామయ్య మరణంపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మొక్కలు నాటడాన్ని తన జీవితాశయంగా పెట్టుకుని తన ఆచరణను వారసత్వంగా కుటుంబానికి అందజేయడం అభినందనీయమని శనివారం ఎక్స్ వేదికగా ఆయన సేవలను స్మరించుకున్నారు. రామయ్య భౌతికంగా మన మధ్య లేకున్నా ఆయన సంకల్పాన్ని కొనసాగించడమే మనం ఆయనకిచ్చే నివాళి అని పేర్కొన్నారు. శోకార్తులైన వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**జీవితాన్ని ధారపోశారు : సంతోష్‌కుమార్**

మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణకు తన జీవితాన్ని ధారపోసిన వనజీవి రామయ్య మరణం తనను ఎంతగానో బాధించిందని మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ అంకితమవ్వాలని పిలుపునిచ్చారు.

**రామయ్య జీవితం స్ఫూర్తిదాయకం : నిరంజన్‌రెడ్డి**

పద్మశ్రీ అవార్డు గ్రహీత, వనజీవి రామయ్య జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. రామయ్య మృతికి సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఎండలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): ఎండల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి దామోదర నర్సింహ సూచించారు. ప్రభుత్వ దవాఖానల్లో తాగునీటి సౌకర్యం, అగ్నిప్రమాదాల నివారణ, వడదెబ్బ బాధితులకు ప్రత్యేక చికిత్స ఏర్పాట్లపై శనివారం మంత్రి నివాసంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సూచనలు చేశారు.

## సీతక్క వర్సెస్ ఎమ్మెల్యేలు

**సమావేశానికి ఎమ్మెల్యేల డుమ్మా**

వరంగల్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంత్రి సీతక్కపై వరంగల్ ఉమ్మడి జిల్లాలోని మెజారిటీ ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. మంత్రి సీతక్క శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. మంత్రి కొండా సురేఖతోపాటు నర్సంపేట, వరంగల్ పశ్చిమ, మహబూబాబాద్, పాలకుర్తి ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, మురళీ నాయక్, యశస్వినీరెడ్డి ఈ సమీక్ష సమావేశానికి హాజరు కాలేదు.



కరీంనగర్ శివారులోని చల్మెడ మెడికల్ కళాశాల స్నాతకోత్సవంలో ఎంబీబీఎస్ విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పక్కన మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

# వైద్యులకు చాలెంజ్‌గా ఏఐ టెక్నాలజీ

- చాట్.. జీపీటీ.. గ్రోక్‌లు ప్రిస్క్రిప్షన్లు రాస్తున్నాయి
- కరుణ, సానుభూతితో వైద్యులు రోగులకు సేవలందించాలి
- చల్మెడ మెడికల్ కళాశాల స్నాతకోత్సవంలో కేటీఆర్

కరీంనగర్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): ఏఐ టెక్నాలజీ వైద్యులకు చాలెంజ్‌గా మారబోతున్నదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. కరీంనగర్‌లో శనివారం జరిగిన చల్మెడ మెడికల్ కళాశాల స్నాతకోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఎంబీబీఎస్ పూర్తి చేసిన–2019 బ్యాచ్ మెడికల్ విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్లు రోగులతో సరిగ్గా మాట్లాడితే సగం జబ్బు నయమవుతుందని, ఇది సైకలాజికల్ ఎఫెక్ట్ అని అన్నారు. రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రూపంలో డాక్టర్లకు పెద్ద సవాల్ ఎదురవబోతున్నదని చెప్పారు. చాట్ జీపీటీ, గ్రోక్‌లు ప్రిస్క్రిప్షన్లు కూడా రాస్తున్నాయని, ఏఐ ఇచ్చే సమాచారం ఆధారంతో చాలామంది రోగులు డాక్టర్ల వద్దకు వస్తున్నారని, రాబోయే రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నదని అన్నారు. ఇలాంటి రోగులను చాలా జాగ్రత్తగా హ్యాండిల్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. కరుణ, దయ, సానుభూతితో రోగులకు వైద్యులు సేవలు అందించాలని కోరారు. వైద్యరంగంలో తెలంగాణ సాధించబోయే ప్రగతిలో వైద్యులందరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. పిల్లలు 8, 9వ తరగతి చదువుతున్నప్పుడే భవిష్యత్తులో ఏం కావాలనుకుంటున్నారనే ఆకాంక్ష మొదలవుతుందని అన్నారు. డాక్టర్ కావాలంటే ఏడెనిమిదేండ్లు చదవాల్సి ఉంటుందని, ఇది మామూలు విషయం కాదని, ఇంత ఓపికతో చదువుతున్న మెడికోలకు అభినందనలు అని తెలిపారు. బీఆర్‌ఎస్ పదేండ్ల పాలనలో మెడికల్ విద్యకు ప్రాధాన్యం ఇచ్చిందని చెప్పారు. ప్రతి జిల్లాలో మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేశామని తెలిపారు. దేశంలో ఇలాంటి అవకాశాలు ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని స్పష్టంచేశారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ ఎంబీబీఎస్ పూర్తిచేసిన వైద్య విద్యార్థులకు అభినందనలు తెలిపారు. చల్మెడ మెడికల్ కళాశాలకు రాష్ట్రంలోనే మంచి పేరు ఉన్నదని అన్నారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ.. ఎంబీబీఎస్ పూర్తిచేసిన మెడికోలు భవిష్యత్తులో మంచి వైద్యులుగా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంబీబీఎస్ పూర్తిచేసిన 119 మంది విద్యార్థులకు కేటీఆర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల చైర్మన్ చల్మెడ లక్ష్మీనరసింహారావు, డైరెక్టర్ డాక్టర్ వీ సూర్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆసిం అలీ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టీ అనిత పాల్గొన్నారు.

**నాకూ డాక్టర్ సీటు వచ్చింది!**

'నన్ను కూడా డాక్టర్‌ను చేయాలని మా అమ్మ కలలు కనేది. ఆమె కోరిక మేరకు నేను కర్నాటకలో కేసెట్ రాశాను. సీటు వచ్చింది. మా అమ్మ చాలా సంతోష పడ్డారు. కానీ మా నాన్న మాత్రం వేరేలా చెప్పారు. ఐదున్నరేండ్లు ఎంబీబీఎస్ చదవాలని ఆ తర్వాత పీజీ చదవాలని, ఆ తర్వాత స్పెషలైజేషన్ కూడా చేయాల్సి ఉంటుందని, వ్యక్తిగత జీవితం ఉండకుండా సేవ చేయాల్సి ఉంటుందని, అందుకు సిద్ధమేనా ఆలోచించుకోవాలని మా నాన్న చెప్పారు. నేను కూడా ఆలోచించి డిగ్రీలో వెళ్లి జాయిన్ అయ్యాను' –కేటీఆర్

# కందిపప్పు కాంట్రాక్ట్‌లో సిండికేట్

- పాలమూరు టెండర్లలో నిబంధనలు బేఖాతరు
- ఉమ్మడి జిల్లా కాంట్రాక్టర్లే వేయాలని నిబంధన
- ఇతర జిల్లాల వారిని అనర్హులుగా గుర్తించి డిస్‌క్వాలిఫై
- గతేడాది అంగన్‌వాడీలకు అధిక ధరలకు సరఫరా



హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తేతెలంగాణ): 'అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పు సరాఫరా కోసం కలెక్టర్ నేతృత్వంలోని డిస్ట్రిక్ట్ ప్రొక్యూర్‌మెంట్ కమిటీ ద్వారా టెండర్లను పారదర్శకంగా నిర్వహించాలి.. తక్కువకు కోట్ చేసిన కాంట్రాక్టర్లకే బాధ్యతలు అప్పగించాలి' అని మంత్రి, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ జారీచేసిన ఆదేశాలు బుట్టదాఖలు అవుతున్నాయి. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఇందుకు విరుద్ధంగా వ్యవహరించినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఈ అక్రమ వ్యవహారంపై మీడియాలోనూ కథనాలు వచ్చాయి. దీంతో కొన్ని జిల్లాల టెండర్లను రద్దుచేశారు. ఈ వ్యవహారం సద్దుమణగక ముందే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధికారులు కాంట్రాక్టర్ల ఎంపికకు కొత్త నిబంధనలను అమల్లోకి తెచ్చినట్టు తెలుస్తున్నది. ఈ నిబంధనల మాటున తమ అనుయాయులకు కాంట్రాక్ట్‌ను కట్టబెట్టి ప్రజాధనాన్ని కొల్లగొట్టేందుకు స్కెచ్ వేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**తగ్గనున్న పోటీ.. పెరగనున్న ధర**

అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే కందిపప్పుకు ప్రభుత్వం గరిష్ఠ ధర కిలో ఒక్కంటికి రూ.164గా నిర్ణయించింది. మహబూబ్‌నగర్‌లో కొత్త నిబంధనల ప్రకారం ఉమ్మడి జిల్లా కాంట్రాక్టర్లకే టెండర్లు దక్కే అవకాశం ఉంటుంది. ఇతర జిల్లాల గుత్తేదారులకు అవకాశం లేకపోవడంతో పోటీ తగ్గనున్నది. దీంతో ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువకు కోట్ చేసే అవకాశం కనిపిస్తున్నది. ఫలితంగా ప్రజాధనం లూటీ అయ్యే ప్రమాదం ఉన్నదని పలువురు ఆరోపిస్తున్నారు. కొందరు కాంట్రాక్టర్ల హక్కులను హరించివేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో లేని నిబంధనలను అమలు చేయడంలోని అంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ నిబంధనలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. నిరుడు సైతం ఇదేవిధంగా ఎక్కువ ధరకు కందిపప్పును సరాఫరా చేయడంపై విమర్శలు వచ్చాయి. నిరుడు వాస్తవంగా ప్రభుత్వం గరిష్ఠ ధర కిలో రూ.165 ఉండగా, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రూ.183 టెండర్‌ను దక్కించుకున్నారు. దీంతో అధిక ధర చెల్లించాల్సి వచ్చింది.

**ఉమ్మడి జిల్లా కాంట్రాక్టర్లకే అవకాశం**

రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలోని నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అంగన్‌వాడీలకు కందిపప్పు సరఫరా చేసే కాంట్రాక్టర్ల ఎంపికకు కొత్త నిబంధనలు అమలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని కాంట్రాక్టర్లకే టెండర్ దాఖలుచేసే అవకాశాన్ని కల్పించారు. ఇతర జిల్లాలకు చెందిన కాంట్రాక్టర్ల టెండర్లను అనర్హతగా గుర్తించి డిస్‌క్వాలిఫై చేసినట్టు తెలుస్తున్నది. ఈ నిబంధనలను ఉమ్మడి జిల్లాలోని కాంట్రాక్టర్లు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సిండికేట్‌గా మారి ప్రజాధనాన్ని అప్పనంగా కొల్లగొట్టేందు కు సిద్ధమైనట్టు సమాచారం. ఇందుకు అక్కడి ఐసీడీఎస్, మహిళా శిశు సంక్షేమ శాఖలోని కొందరు అధికారులు సైతం సహకరిస్తున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి.

## 'భూ భారతి'పై అవగాహన సదస్సులు

- రేపు పోర్టల్ ప్రారంభం
- రాష్ట్ర వ్యాప్తంగా మూడు మండలాల్లో పైలట్ ప్రాజెక్ట్
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): భూభారతి అమలుపై రాష్ట్రంలోని అన్ని మండలాల్లో సదస్సులు నిర్వహించాలని కలెక్టర్లను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిన మూడు మండలాల్లో ఈ నెల 14న భూభారతి పోర్టల్‌ను ప్రారంభించనున్నట్టు ఆయన వెల్లడించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి శనివారం భూభారతిపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. పోర్టల్‌పై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేందుకు ఎంపికచేసిన మూడు మండలాల్లో సదస్సులు నిర్వహించాలని కలెక్టర్లకు సూచించారు. ప్రజల నుంచి వచ్చే సలహాలు, సూచనలను స్వీకరించి పోర్టల్ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు.

**నిరుపేదలకే ఇందిరమ్మ ఇండ్లు**

అర్హులైన నిరుపేదలకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. శనివారం తన నివాసంలో సమీక్షించారు. లబ్ధిదారుల ఎంపికలో ఇందిరమ్మ కమిటీలు నిబంధనల ప్రకారం వ్యవహరించాలని సూచించారు.

# రాజీవ్‌యువ 'ప్రహసనం'!

- ఇదీ రాజీవ్ యువ వికాసంలో యువత పడుతున్న గోస
- రేపటితో ముగియనున్న దరఖాస్తుల గడువు
- ఇన్‌కమ్ సర్టిఫికెట్ల రాక కోసం యువత ఎదురుచూపులు
- గడువు పొడిగించాలని లబ్ధిదారుల డిమాండ్

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం ఊరించిన రాజీవ్ యువ వికాసం పథకం యువతను ఉసూరుమనిపిస్తున్నది. దరఖాస్తు ప్రక్రియ ప్రహసనంలా కొనసాగుతున్నది. ఒకవైపు ప్రభుత్వం ఆదా య ధ్రువీకరణ పత్రం మెలిక పెట్టగా, మరోవైపు రెవెన్యూ అధికారులు సదరు పత్రాలను జారీ చేయడంలో తాత్సారం చేస్తున్నారు. ఇక సర్వర్ సైతం మొరాయిస్తుండడంతో నిరుద్యోగ యువత ఇబ్బందులకు గురవుతున్నది. రేపటి (సోమవారం)తో దరఖాస్తులకు తుది గడువు ముగిసిపోనుండగా, ఇప్పటికీ ఇంకా లక్షలాది మంది ఆశావహులు దరఖాస్తు కోసం ఎదురుచూస్తున్నారు. గడువు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

**ఇవ్వని కార్డులు తెచ్చేదెలా?**

యువవికాసం పథకంలో ప్రభుత్వం విధించిన నిబంధనలు విమర్శలు తావిస్తున్నాయి. ఆదాయ సర్టిఫికెట్లను, లేదంటే రేషన్‌కార్డులను కచ్చితంగా పొందుపరచాలని ప్రభుత్వం తెలిపింది. కొత్త రేషన్‌కార్డులు జారీ చేయకపోకవడంతో చాలా మంది ఆదాయ సర్టిఫికెట్ల కోసం పరుగులు తీస్తున్నారు.



ఫిర్యాదు పత్రాన్ని చూపిస్తున్న మోహన్

**మొరాయిస్తున్న సర్వర్**

ప్రభుత్వం యువవికాసం దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నది. ఆధార్‌కార్డు. రేషన్ కార్డు, ఇన్‌కమ్ సర్టిఫికెట్, కులధ్రువీకరణ పత్రం నంబర్లను ఎంట్రీ చేయడంతోపాటు, ఫొటోలను అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఆన్‌లైన్‌లో అప్లికేషన్‌ను సమర్పించిన తర్వాత దానిని డౌన్‌లోడ్ చేసుకుని, ధ్రువీకరణ పత్రాలను జతచేసి మండల కార్యాలయాల్లోని ప్రజాపాలన కేంద్రాల్లో సమర్పించాల్సి ఉంది. అయితే సర్వర్‌లు మొరాయిస్తునాయి.

**ఆధార్ కార్డు ఒకరిది.. పేరు ఇంకొకరిది**

గంగాధర, ఏప్రిల్ 12: కరీంనగర్ జిల్లా గంగాధరలో యువవికాసంలో దరఖాస్తు చేసుకునేందుకు వెళ్లిన మోహన్‌కు వింత అనుభవం ఎదురైంది. తన ఆధార్ కార్డు నంబర్ ఎంటర్ చేయగానే అదే నెంబర్‌తో కురిక్యాల గ్రామానికి చెందిన మహిళ దరఖాస్తు చేసుకున్నట్టు ఆన్‌లైన్‌లో చూపించింది. తన రేషన్ కార్డు నెంబర్‌తో ఎంటర్ చేసి చూసినా ఆ మహిళ పేరునే దరఖాస్తు చేసుకున్నట్టు ఆన్‌లైన్‌లో చూపిస్తున్నదని తెలిపాడు. దీనిపై బీసీ కార్పొరేషన్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్టు తెలిపాడు.

| రాజీవ్ యువ వికాసం వివరాలు | |
|---|---|
| ప్రభుత్వం హామీ ఇచ్చిన రుణాలు | రూ.6,000 కోట్లు |
| దరఖాస్తుల స్వీకరణకు గడువు | ఏప్రిల్ 14 |
| అందిన దరఖాస్తులు | దాదాపు 14లక్షలు |
| ఇన్‌కమ్ సర్టిఫికెట్లు లేక పెండింగ్ అర్జీలు | 6 లక్షలు |
| ఇన్‌కమ్ సర్టిఫికెట్ల కోసం వచ్చిన అర్జీలు | 16లక్షలు |
| జారీ చేసిన ఇన్‌కమ్ సర్టిఫికెట్లు | 9లక్షలు |
| పెండింగ్ ఇన్‌కమ్ సర్టిఫికెట్లు | 7లక్షలు |

| రాజీవ్ యువ వికాసం నిబంధనలు | |
|---|---|
| గ్రామాల్లో ఆదాయ పరిమితి | రూ.1.50 లక్షలు |
| పట్టణాల్లో ఆదాయ పరిమిది | రూ.2 లక్షలు |
| రేషన్‌కార్డు/ఇన్‌కమ్ సర్టిఫికెట్ | తప్పనిసరి |

# సలహాదారుగా మరో రాష్ట్రేతరుడు

- తమిళనాడుకు చెందిన వ్యక్తిని ధార్మిక సలహాదారుగా నియమిస్తూ సర్కారు ఉత్తర్వులు
- ఆ పదవికి ఇక్కడ అర్హులెవరూ లేరా?
- రాష్ట్రంలో ఇంతమంది ధార్మికవేత్తలున్నా వేరేవాళ్లను అందలమెక్కించడమేంది?
- ఇది తెలంగాణ స్వాభిమానానికి దెబ్బ
- తెలంగాణ పండితుల మండిపాటు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్12 (నమస్తే తెలంగాణ) : ఇప్పటికే కార్పొరేష న్ చైర్మన్ పదవులు, సలహాదారుల నియామకాల్లో రాష్ట్రేతరులకు పెద్దపీట వేసిన రేవంత్ ప్రభుత్వం, ఇప్పుడు మరో రాష్ట్రేతరుడిని తెలంగాణ దేవాదాయ, ధర్మాదాయశాఖ ధార్మిక సలహాదారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయాన్ని చూస్తుంటే 'రాష్ట్రంలో ఉన్న ధార్మికవేత్తలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిన్నచూపు ఉన్నదా?' అన్న అనుమానాలు కలుగుతున్నాయి. తమిళనాడుకు చెందిన జీ గోవిందహరిని ధార్మిక సలహాదారుగాని యమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం, ఆయనకు రాష్ట్రంలోని దేవాలయాలు, జాతరల్లో ప్రత్యేక ఆహ్వానితుడిగా ఉండడమే కాకుండా ఆలయాల అభివృద్ధికి సూచనలిచ్చేలా, శాఖాపరమైన ముఖ్య నిర్ణయాల్లో కీలకంగా వ్యవహరించేలా అధికారాలిచ్చింది. రాష్ట్రంలో అసలు ధార్మికవేత్తలు, పండితులే లేనట్టు వేరే రాష్ట్రానికి చెందిన వ్యక్తిని ధార్మిక సలహాదారుగా ఎలా నియమిస్తారని పండితులు, ధార్మిక వేత్తల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతున్నది.

**ఇక్కడెవరూ లేరా?**

అసలు రాష్ట్రంలో ఈ పదవికి అర్హతలున్న వారెవరూ లేరా? అని తెలంగాణ పండితులు, ధార్మిక వేత్తలు ప్రశ్నిస్తున్నారు. యాదగిరిగుట్ట వేదపాఠశాల సలహాదారుగా కూడా గోవిందహరే వ్యవహరిస్తున్నారు. అంటే రాష్ట్రంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలో జరిగే ముఖ్య కార్యక్రమాలన్నిటినీ ఈయనే పర్యవేక్షిస్తున్నారని తెలంగాణ పండితులు చెప్తున్నారు. అసలు రాష్ట్రంలో ఇంతమంది ధార్మికవేత్తలు ఉండగా పక్క రాష్ట్రం వారిని అందలమెక్కించడమేమిటని, తెలంగాణ స్వాభిమానాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని మండిపడుతున్నారు. తమ వారిని అందలమెక్కించడమే పనిగా సదరు వ్యక్తుల అర్హతలను చూడకుండా, వారి గత చరిత్రను పరిశీలించకుండా ఎవరిని పడితే వారిని ముఖ్యమైన పదవుల్లో నియమించడమేమిటని తెలంగాణ ధార్మిక లోకం ప్రశ్నిస్తున్నది.

**గోవిందహరిపై విమర్శల వెల్లువ**

తెలంగాణ దేవాదాయశాఖ ధార్మిక సలహాదారుగా నియమితులైన గోవింద హరి వాస్తవానికి తమిళ అయ్యర్‌అని తెలంగాణ ధార్మికవేత్తలు చెప్తున్నారు. ఈయన హైదరాబాద్‌లోని వెస్ట్‌మారేడ్‌పల్లిలో నివాసముంటున్న తమిళియన్ అని, పలు ధార్మిక పీఠాలకు సంబంధించి వివాదాస్పద వ్యక్తిగా నిలిచారని పేర్కొంటున్నారు. ప్రస్తుతం తెలంగాణలో గోవిందహరి నియామకం, ఆయన గత చరిత్రపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ నడుస్తున్నది. గోవిందహరి గతంలో కంచి పీఠం, కోయంబత్తూరు స్వామివారు, పుష్పగిరి పీఠం.. ఇలా పలు ధార్మిక పీఠాలు, మఠాల వద్ద చేరి వారితో కలిసి ఉంటూనే సమస్యలకు కారణమయ్యారన్న ఆరోపణలు ఉన్నాయి. 'సనాతన ధర్మానికి వేదికైన తెలంగాణలో ఎంతో మంది ధార్మికవేత్తలు, పండితులు ఉండగా అసలు శాస్త్రాలే తెలియని గోవిందహరి లాంటి వ్యక్తిని ధార్మిక సలహాదారుగా ఎలా నియమిస్తారు? ఆయనకు ఏదైనా శాస్త్రంలో ప్రావీణ్యం ఉన్నదా ముందు తెలుసుకోండి' అంటూ ధార్మిక వేత్త కంచి చింతపల్లి సుబ్రహ్మణ్యం సూచించారు. 'తెలంగాణలో పండితులే లేనట్టుగా తమిళనాడు నుంచి ఒక వ్యక్తిని తీసుకొచ్చి ఇక్కడ ధార్మిక సలహాదారుగా నియమించడమనేది చాలా బాధాకరమైన విషయం. ఎన్నో సంస్కృతులకు మూలమైన తెలంగాణలో ఇక్కడి సంప్రదాయాలు, సంస్కృతి తెలిసిన వ్యక్తులు.. అదికూడా శాస్త్రం తెలిసిన పండితులు, ధార్మిక వేత్తలకు అవకాశం కల్పిస్తే బాగుండేది' అని మరో ధార్మికవేత్త దర్శనం శర్మ అభిప్రాయపడ్డారు.



## తాండూరు ఎమ్మెల్యేకు నిరసన సెగ

తాండూరు, ఏప్రిల్ 12: హామీల అమలుపై తాండూరు ఎమ్మెల్యేను నియోజకవర్గ ప్రజలు నిలదీశారు. 'జై బాపు, జై భీం, జై సంవిధాన్' పేరుతో కాంగ్రెస్ తలపెట్టిన పాదయాత్రలో భాగంగా శనివారం వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం ఓమ్లానాయక్ తండా, తట్టెపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఎక్కడంటూ గిరిజన మహిళలతోపాటు ప్రజలు ఎమ్మెల్యేను నిలదీశారు. పల్లెల్లో నీళ్లు లేక పంటలు ఎండిపోతుంటే పట్టించుకోని కాంగ్రెస్ నాయకులు ఏదో ఉద్ధరించినట్టు తిరగడమేమిటని ప్రశ్నించారు.